సాక్షి
మహబూబ్‌నగర్

సోమవారం । 29 । మే । 2023



బీటీ రోడ్లు ధ్వంసం

గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లను కేజ్ వీల్స్‌తో నడపడంతో బీటీ రోడ్లు దెబ్బతింటున్నాయి.

వివరాలు 8లో ▸



మెరుగైన వైద్యం..

అచ్చంపేటలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రితో మెరుగైన వైద్యం అందనుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం

42.7 /29.3

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు 'ప్రజావాణి' రద్దు

పాలమూరు: పాలనపరమైన కారణాలతో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా ప్రజలు ఎవరూ ఫిర్యాదులు సమర్పించడానికి కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన కోరారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

పాలమూరు: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అత్యవసర సమావేశం సోమవారం సాయంత్రం 4గంటలకు పరిశ్రమల కాలనీలో ఉన్న ఫోరం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హైదరాబాద్ బర్కత్‌పుర పీఎఫ్ నోడల్ అధికారి రమేష్ హాజరై ఎస్‌ఆర్‌బీఎస్ లైఫ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ సిస్టం చేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

మరో 20 ఏళ్లు బీఆర్‌ఎస్‌దే అధికారం



అడ్డాకుల: రాష్ట్రంలో మరో 20 ఏళ్లు బీఆర్ఎస్సే అధికారంలో ఉంటుందని, ప్రతిపక్షాల మభ్య పెట్టే మాటలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అడ్డాకుల మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కందూర్ స్టేజీ సమీపంలో నిర్వహించగా మంత్రితోపాటు జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల పని అయిపోయిందని, రాష్ట్రంలో 60, 70 నియోజకవర్గాలకు ప్రతిపక్ష నాయకులే లేరని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఉచిత పథకాలను ఇవ్వకుండా బీజేపీ ఆపే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే ఎమ్మెల్యే ఆలను మరోసారి దీవించాలని ప్రజలను కోరారు. జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణమ్మ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ మూడోసారి ఆదరిస్తే నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశానన్నారు. ప్రతిపక్షాలకు పేదలపై ప్రేమ లేదని, రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌ల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం అభివృద్ధి పనుల ప్రొసీడింగ్ పత్రాలను నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మంజుల, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, వైస్ ఎంపీపీ రాధిక, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ, వింగ్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రపై సంపూర్ణ అవగాహన

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్రపై యాత్రికులు సంపూర్ణ అవగాహన ఉండాలని మౌలానా రఫీక్ ఉర్ రహమాన్ అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో హజ్‌యాత్రీకులకు చివరి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులు యాత్ర నియమ, నిబంధనలు, చేసే పద్ధతుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రత్యేకంగా డిజిటల్ ట్రెనింగ్ ద్వారా అవగాహన కల్పించారు. వీడియో ద్వారా హజ్‌యాత్ర గురించి వివరించారు. జిల్లా హజ్ సొసైటీ ప్రతినిధులు ఎహ్రాం ధరించే విధానాన్ని ప్రాక్టికల్‌గా యాత్రికులకు అవగాహన కల్పించారు. అనంతరం యాత్రికులకు మెడికల్ స్క్రీనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ మహమూద్‌అలీ, ఎంఏ సత్తార్, రవూఫ్ పాషా, ఫైజొద్దీన్, అహ్మద్ పటేల్, కలీం, రఫీక్, రజాక్, హాషం, అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



ముందస్తు నాట్లే మేలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం):

జూలై 15లోగా నాట్లు వేయించేలా ప్రణాళిక

- వడగండ్లను తప్పించేందుకు సీజన్‌లో మార్పులు
- వానాకాలం పంటల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన అధికారులు
- పెరగనున్న పత్తి, కంది, మొక్క జొన్న, జొన్న, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం
- విత్తనాలు, కాంప్లెక్స్, ఎరువుల ప్లానింగ్‌సిద్ధం



రసాయనిక ఎరువుల ప్రణాళిక

(మెట్రిక్ టన్నుల్లో..)

యూరియా	డీఏపీ
32,990.4	18,328

ఎంఓపీ	9,164.0
కాంప్లెక్స్	27,492
ఎస్ఎస్‌పీ	7,331.2

వానాకాలం పంటల ప్రణాళిక ఖరారైంది. జిల్లాలో 2023- 24 వానాకాలానికి సంబంధించిన పంటల అంచనా సాగు విస్తీర్ణం, అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో నేల స్వభావాన్ని బట్టి ఏయే పంటలు.. ఎంత విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉందనే దాన్ని బట్టి మండలాల వారీగా ప్లానింగ్ తయారు చేశారు. జూన్‌లో వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. అన్ని రకాల పంటలు కలిపి జిల్లావ్యాప్తంగా 3,77,917 ఎకరాల్లో సాగు అవుతాయని అంచనా వేస్తున్నారు. కాగా ఈ సీజన్ నుంచి వానాకాలం, యాసంగి సీజన్‌లను ముందుకు జరపాలని వ్యవసాయశాఖ భావిస్తోంది. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్‌లో వడగండ్ల వాన కురిసి పంటలకు పెద్దమొత్తంలో నష్టం జరుగుతుంది. ఈ క్రమంలో ముందస్తుగా నాట్లు వేయించి, ముందస్తుగా కోతలు కోయించేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఈ సీజన్ నుంచే నిర్ణయాన్ని అమలు చేసేలా ముందుకెళ్తున్నారు.

రైతులకు అవగాహన..

యాసంగి సీజన్‌లో వడగండ్ల వల్ల కలిగే నష్టాన్ని తప్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీజన్లను ముందుకు జరపాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలను సైతం జారీ చేసింది. దీంతో గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణాధికారులు రైతులకు ఆ దిశగా అవగాహన కల్పిస్తున్నారు. సాధారణంగా ఏటా వానాకాలం సీజన్‌లో వరినాట్లు జూలైలో ప్రారంభించి సెప్టెంబర్ వరకు వేస్తారు. దీంతో వానాకాలం కోతలు ఆలస్యమై యాసంగిపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యాసంగి కోతలు మే నెల వరకు జరుగుతున్నాయి. దీంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో సరిగ్గా వరిపంట పొట్ట దశలో ఉన్న సమయంలో వడగండ్లు పడి తీవ్రనష్టం జరుగుతుంది. దీనిని అధిగమించేందుకు ముందస్తుగా నాట్లు వేయించాలని అధికారులు భావిస్తున్నారు. జూన్ 15లోగా నారు పోసుకొని జూలై 15లోగా నాట్లు పూర్తి చేసేలా చూస్తున్నారు. అలాగే యాసంగి సీజన్‌లో నవంబర్ 15లోగా నారు పోసుకొని డిసెంబర్ 15లోగా నాట్లు వేసేలా ప్రయత్నిస్తున్నారు.

అనుకూల రకాలపై కసరత్తు..

సీజన్‌ను ముందుగా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా నేలల స్వభావాన్ని బట్టి అవసరమయ్యే కొత్త రకాలను తెప్పించే పనిలో అధికారులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీజన్‌ను ముందుగా ప్రారంభిస్తున్నందున ఏ జిల్లా పరిస్థితులకు అనుగుణంగా ఏయే రకాలు అవసరమవుతాయనే దానిపై రాష్ట్రస్థాయిలో కసరత్తు జరుగుతుంది. ఈ నెలాఖరులోగా దీనిపై స్పష్టత రానున్నట్లు తెలిసింది. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి ఏయే రకాలు సాగుకు అనుకూలంగా ఉంటాయన్న దానిపై క్లారిటీ రానుంది. యాసంగి సీజన్‌లో నవంబర్‌లో నారు పోసుకోవడం వల్ల చలి తీవ్రత కారణంగా నారు ఎదగదని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఏ రకాలైతే అనుకూలంగా ఉంటాయో వాటినే అందుబాటులో ఉంచాలని అధికారులు భావిస్తున్నారు.

పెరిగిన సబ్సిడీ విత్తనాల ధర

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పత్తి అధికంగా సాగయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో రైతుపై విత్తన ధర భారం పడనుంది. గతేడాది పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.810 ఉండగా.. ప్రస్తుతం రూ.853 అయింది. ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెరిగింది. దీంతోపాటు ఎరువులు, పురుగు మందులు, కూలీల ధరలు కూడా మరింత భారం కానున్నాయి. అలాగే జీలుగ, జనుము విత్తనాల ధరలు సైతం పెరిగాయి.

ప్రారంభంలోగా స్పష్టత..



యాసంగి కోతల సమయంలో వడగండ్ల కారణంగా జరిగే నష్టాన్ని నివారించడానికి పంటల సాగు సీజన్‌ను ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. వానాకాలం సీజన్‌లో జూలై 15లోగా, యాసంగి సీజన్‌లో డిసెంబర్ 15లోగా నాట్లు పూర్తి చేసేలా చూడాలని ప్రభుత్వం చెబుతోంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సీజన్‌కు ముందుగా ప్రారంభం కావడం వల్ల నేల స్వభావాన్ని బట్టి అవసరమయ్యే విత్తనాలను పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీజన్ ప్రారంభంలోగా దీనిపై స్పష్టత రానుంది. రైతులు నేరుగా వెదజల్లే పద్ధతిపై ఆసక్తి చూపించాలి.

– వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

వానాకాలం పంట అంచనా ఇలా..

జిల్లాలో మొత్తం సాగు 3,77,917 ఎకరాలు

వరి : 1,89,917	పత్తి : 1,15,845
మొక్కజొన్న : 28,546	జొన్న : 13,015
కంది : 12,548 	ఆముదం : 1,565 
రాగులు : 855 	పెసర : 195 
మినుములు : 65 	ఉలవలు : 81 
వేరుశనగ : 69 	చెరుకు : 61 
ఇతర పంటలు 405	కూరగాయల తోటలు 14,750

95,305.6 మె.ట., ఎరువులు

వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా 95,305.6 మె.ట., ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సీజన్ ఆరంభం కాగానే అవసరమైన ఎరువులు జిల్లాకు చేరుకోనున్నాయి. భూమిలో భాస్వరం శాతం అధికంగా పేరుకుపోతుండటంతో భాస్వరం వినియోగాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామాల్లో అవగాహన సదస్సుల ద్వారా భాస్వరం వినియోగం తగ్గింపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్యం చేస్తున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

- మహిళల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి
- శిశువుల ఆరోగ్యం, బరువు పెంపునకు దోహదం
- ఇప్పటికే జిల్లాకు చేరిన 433 బాస్కెట్ కిట్లు
- రెండు విడతల్లో అందించేందుకు ఆరోగ్య శాఖ కసరత్తు
- జూన్ 2 తర్వాత ప్రారంభానికి చర్యలు



పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ జిల్లాలో త్వరలో ప్రారంభం కానుంది. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ఆ సమస్యను అధికమించేందుకు పోషకాహార కిట్లు దోహదపడతాయి. ఒక్కో కిట్టు విలువ రూ.2 వేలు ఉండగా.. దీనిని రెండు దఫాలుగా అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం జిల్లాలో కేసీఆర్ కిట్ పోర్టల్‌లో నమోదవడంతోపాటు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి లేదా పీహెచ్‌సీల్లో రెండు సార్లు పరీక్షలు పూర్తి చేసుకున్న వారే అర్హులుగా గుర్తిస్తారు. జిల్లాలో గర్భిణులు 8,563 మంది ఉంటే వీరిలో 27 నుంచి 34 వారాలు పూర్తయిన వారు 669 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాకు అవసరమైన కిట్లను హైదరాబాద్ నుంచి సరఫరా చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు జిల్లాకు 433 కిట్లు వచ్చాయి.

మూడు ఆస్పత్రుల పరిధిలో..

జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో పోషకాహార కిట్లు అందజేయడానికి ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. మహబూబ్‌నగర్ నియోజకర్గంలో జిల్లా జనరల్ ఆస్పత్రిలో, జడ్చర్ల నియోజకవర్గంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో, దేవరకద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జనరల్ ఆస్పత్రికి 218, బాదేపల్లి సీహెచ్‌సీకి 145, దేవరకద్ర పీహెచ్‌సీకి 70 కిట్లు వచ్చాయి. జిల్లాలో దాదాపు 2 వేల వరకు గర్భిణులు ఉంటే వీరందరికీ రెండు దశల్లో అందిస్తారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యే వరకు రెండుసార్లు ఇవ్వనున్నారు. మొదటిసారి ప్లాస్టిక్ బుట్టలో పోషకాహార వస్తువులను అందిస్తుండగా.. రెండో విడతలో బ్యాగ్‌ను అందిస్తారు. ఈ బ్యాగ్‌లో గర్భిణులకు అవసరమైన పోషకాహార వస్తువులు ఉంటాయి.

రెండు విడతల్లో అందజేత

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో పరీక్షలు చేసుకుని రిజిస్ట్రేషన్ అయిన గర్భిణుల్లో 13- 24 వారాల గర్భం కలిగిన మహిళకు మొదటి విడతగా వివిధ రకాల పోషకాహారం ఉన్న బుట్టను అందిస్తారు. 25–32 వారాల గర్భం కలిగిన వారికి రెండో విడత కింద పోషకాహార వస్తువులు ఉన్న బ్యాగ్ ఇస్తారు. ప్రతి గర్భిణి ప్రసవం అయ్యే వరకు నాలుగు సార్లు పరీక్షలు నిర్వహిస్తారు. 12 వారాల వరకు మొదటిసారి, 13 నుంచి 24 వారాల మధ్యలో రెండోసారి, 25 నుంచి 32 వారాల మధ్యలో మూడోసారి, 32 వారాల నుంచి డెలివరీ అయ్యే వరకు నాలుగోసారి ఆస్పత్రిలో పరీక్షలు చేస్తారు. గర్భిణుల్లో చాలా మందిలో రక్తహీనత ఉండటం వల్ల నవజాత శిశువులు బలహీనంగా, ఆరోగ్య సమస్యలతో జన్మిస్తున్నారు. ఈ కిట్లను అందించి పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉండటంతోపాటు కావాల్సిన బరువుతో ఉండాలని పోషకాహార కిట్లు అందిస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..

జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో పోషకాహార కిట్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. రెండు విడతల్లో కిట్లు ఇచ్చే విధంగా ప్రణాళిక ఉంది. మొదటి విడతలో బాస్కెట్, రెండో విడతలో సంచిలో వస్తువులు ఇస్తాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేసుకుని ప్రసవం అయ్యే వారికి అందిస్తాం.

– డాక్టర్ కృష్ణ, డీఎంహెచ్ఓ

అర్హులను గుర్తించాం..

జూన్ 14న జిల్లాలో పోషకాహార కిట్ల పంపిణీ ఉంటుంది. మూడు చెకప్‌లు అంటే ఆరు నెలలు నిండి 7వ నెలలోకి ప్రవేశించిన గర్భిణులకు ఈ కిట్లు అందించడం జరుగుతుంది. 27 నుంచి 34 వారాల మధ్యలో ఉన్న వారికి అందిస్తాం. ఇప్పటికే అర్హులను గుర్తించడం జరిగింది. మూడు నియోజకవర్గాల్లో పంపిణీ కార్యక్రమం చేపడతాం.

– డాక్టర్ శ్వేతారెడ్డి, ప్రోగ్రాం అధికారి

పోషకాహార కిట్‌లో ఉండే వస్తువులు

మదర్స్ హార్లిక్స్ (500 గ్రాములు) : 2	
ఐరన్ సిరప్ (200 మిల్లీ లీటర్స్) : 3	
లయన్ డేట్స్ (500 గ్రాములు) : 2	
కాటన్ క్లాత్ బ్యాగ్ : 1	
విజయ నెయ్యి (450 మి.లీటర్లు) : 1	
పల్లీ పట్టీలు : 2	కప్పు : 1



సండే.. 'ఫైర్' డే



- నిప్పులు కురిపించిన భానుడు
- జిల్లాలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మూడు రోజుల్లోనే 3 డిగ్రీల పెరుగుదల
- వడగాల్పులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

పాలమూరు: ఇవేం ఎండలు బాబోయ్.. రాళ్లు పగిలేలా సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. మొత్తంగా ఆదివారం కనిపించిన ఎండలు చూస్తే 'ఫైర్' డేను తలపించాయి. మూడు రోజులుగా ఎండల ప్రభావం విపరీతంగా పెరిగింది. రోజు రోజుకు పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలు ఆదివారం ఏకంగా 42.7 నమోదయ్యాయి. జిల్లాలో మండుటెండలకు ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఉదయం 8 గంటల నుంచే భానుడు విశ్వరూపం దాల్చడంతో జనం ఉక్కపోతతో తల్లడిల్లారు. ఎండ వేడికి వడగాలులు తోడవడంతో అల్లాడుతున్నారు. ఎండ ధాటికి కూలర్లు, ఏసీలు ఉన్నా ఉపశమనం లభించడం లేదు. చాలామంది వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. రానున్న వారం రోజుల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. మే నెలలో భూమి సూర్యుడికి దగ్గరగా వెళ్లడం వల్ల ఎండ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. దీనికి తోడు అడవుల నరికివేత, ఇతరత్రా కారణాలతో వాతావరణంలో ప్రతికూల మార్పులు సంభవించి ఎండ తీవ్రత మరింత పెంచుతుంది. ఈ వేసవి నిప్పుల కొలిమేనని భారత వాతావరణ విభాగం మార్చి నెలలో ప్రకటించగా అన్నట్లుగానే వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పుడే 42.0 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదవుతుండగా రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ఇంట్లో ఉన్నా ఇబ్బందులే..

ఎండలకు కూలర్లు వేసుకుని ఇంట్లో ఉన్నా వేడిగాలుల తాకిడికి శరీరం ఉడికిపోతుంది. స్వీయ జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ఇంట్లో ఉన్నా పైకప్పుల నుంచి వచ్చే వేడి గదిని చిన్నారులు తట్టుకోలేకపోతున్నారు. తలుపులు బిగించినా గదిలో గాలి బయటికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కూలర్ల గాలి సైతం సరిపోకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



ఇంద్రకల్‌లో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

- తెలంగాణ తెచ్చుకున్నది దొరల కోసం కాదు
- మట్టి, ఇసుక దందాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తలమునకలు
- నిరుపేదల సమస్యలు వారికి పట్టవు
- ఇంద్రకల్ కార్నర్ మీటింగ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్ పాలనలో మట్టి, ఇసుక, అక్రమాలతోనే ఎమ్మెల్యేలకు సరిపోతోందని, ప్రజల బాగోగులపై వారికి పట్టింపు కరువైందన్నారు. సీఎల్పీ నేత భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం 73వ రోజు తాడూరు మండలంలోని కుమ్మెర రైస్‌మిల్లు నుంచి ప్రారంభమై యతాత్మపూర్, ఇంద్రకల్, అయ్యప్ప టెంపుల్ మీదుగా తాడూరుకు చేరుకుంది. అంతకు ముందు ఇంద్రకల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ ఒక్కరికి కూడా ఉపయోగం లేకుండా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సీలకు రుణాలు, సబ్సిడీలతోపాటు అన్ని వర్గాలకు ప్రభుత్వ ఫలాలు అందించామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు తీవ్రమైన నష్టం జరిగిందని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్, ఐటీడీఏ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర సంపదను బడుగులకు పంచేందుకు తెలంగాణ తెచ్చుకున్నాం.. దొరల కోసం కాదని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం తట్టెడు మట్టి తీసి పిల్ల కాల్వలను కూడా తవ్వలేకపోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే చెరువుల్లో నీరు నిలిచే అవకాశం లేకుండా నల్లమట్టిని తవ్వుకుని కాంట్రాక్టర్లకు అమ్ముకున్నాడని విమర్శించారు. తెలంగాణ తెచ్చుకున్నది మట్టి జనార్దన్‌రెడ్డి లాంటి వారికోసం కాదని ఎద్దేవా చేశారు.

ఊరికో ఉద్యోగం కూడా లేదు..

రాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి అన్నారు. పేపర్ లీకులతో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం తాడూరులోని రైస్‌మిల్లు నుంచి ప్రారంభమైన భట్టి పీపుల్స్ పాదయాత్ర జగ్గయ్యపల్లి, మంతటి క్రాస్‌రోడ్డు మీదుగా దేశిఇటిక్యాల గ్రామానికి చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రోహిణి, సుమిత్ర, కేవీఎన్ రెడ్డి, నాయకులు అర్థం రవి, కొడిదల రాము, బాలాగౌడ్, వల్లపు రెడ్డి, హబీబ్, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస ప్యాకేజీ స్వాహా

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు వట్టెం రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని భట్టి ఆరోపించారు. ప్రాజెక్టు కింద 4,500 ఎకరాలు సేకరించగా.. 463 ఇండ్లను నిర్వాసితులు కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. నిర్వాసితులంతా దళిత, గిరిజనులే కాగా, వీరి పట్ల మానవత్వంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వం.. కనీసం చట్టబద్ధంగానూ న్యాయం చేయలేదని మండిపడ్డారు. భూమి అడిగిన నిర్వాసితులను జైలుకు పంపుతామని బెదిరించడం వారి హక్కులను కాలరాయడమేనని చెప్పారు. 18 ఏళ్లు నిండిన 154 మందికి ఇంకా పునరావాస ప్యాకేజీ అందలేదని వివరించారు. కారుకొండలోని సర్వే నంబర్ 87లో సుమారు 20 ఎకరాల్లో కాస్తులో ఉన్న దళిత కుటుంబాలకు పరిహారం ఇవ్వకుండా కొంతమంది దళారులు స్వాహా చేశారని ఆరోపించారు.

నేటినుంచి నూతన ఆస్పత్రిలో వైద్య సేవలు

జడ్చర్ల టౌన్: పట్టణ శివారులోని గంగాపూర్ రోడ్డు సమీపంలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిలో సోమవారం నుంచి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని సూపరింటెండెంట్ సోమశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులు, ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు. ఓపీ సేవలు సైతం నూతన ఆస్పత్రిలోనే ప్రారంభిస్తున్నామని, సాధారణ రోగులతోపాటు అందరూ అక్కడికే రావాలన్నారు. ఈ మేరకు పాత ఆస్పత్రి నుంచి కొత్త ఆస్పత్రికి అన్నిరకాల సామగ్రి తరలించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

చెట్టుకు ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

మహమ్మదాబాద్: యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జూలపల్లికి చెందిన జింటిపల్లి రమేష్ (28) హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఏడాది క్రితం ఫైనాన్స్‌లో బైక్ కొన్నాడు. ఇదే సమయంలో శనివారం బైకు ఫైనాన్స్ వారు 10నెలల వాయిదా డబ్బులు కట్టాలంటూ యువకుడిని మహబూబ్‌నగర్ కార్యాలయానికి తీసుకెళ్లి సాయంత్రం వదిలిపెట్టారు. సాయంత్రం ఇంటికి వచ్చిన యువకుడు ఆర్థిక సమస్యలను భరించలేక మద్యం తాగి పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

రాజాపూర్: మండలంలోని నాన్‌చెరువుతండాకు చెందిన వివాహిత అనారోగ్యంతో మనస్తాపం చెందిన ఆదివారం ఇంట్లో ఉరేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాన్‌చెరువుతండా చెందిన మంజుల (34)కు తండాకుచెందిన శంకర్‌తో 18ఏళ్ల క్రితం వివాహమైంది. కొన్ని ఏళ్ల నుంచి ఆమె నరాల సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడుతున్నానని, తాను చనిపోతానని అప్పుడప్పుడు తన కూతురు శ్రావ్యతో చెప్పేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతురాలి తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారును ఢీకొన్న అంబులెన్స్

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు కారును అంబులెన్సు ఢీకొట్టిన సంఘటన ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మహబూబ్‌నగర్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు సంబంధించిన అంబులెన్స్ వాహనం ఆదివారం గద్వాల నుంచి ఎర్రవల్లి వైపు డ్రైవర్ తీసుకెళ్తున్నాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలోని ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొని, పక్కనే ఉన్న కలెక్టరేట్ ఆర్చీ గోడను సైతం తాకింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ఆర్చీ గోడ సైతం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. పట్టణ ఎస్ఐ రామస్వామి అక్కడికి చేసుకుని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

కేజీ వీల్స్‌తో బీటీ రోడ్లు ధ్వంసం



ట్రాక్టర్లు కేజీ వీల్స్‌తో వెళ్లడం కారణంగా దెబ్బతిన్న కొత్తూరు రోడ్డు

- గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

జడ్చర్ల: ఏ ఊరికి వెళ్లినా రోడ్డు బాగుందంటే అక్కడ అభివృద్ధిని అంచనా వేస్తారు. అన్ని ఉన్నా రోడ్డు బాగా లేదంటే అక్కడ అభివృద్ధి శూన్యమని అంతా ప్రచారం చేస్తారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి వేసిన బీటీరోడ్లు చిన్న చిన్న తప్పిదాల వలన గుంతలమయంతో మళ్లీ యధాస్థితికి వస్తున్నాయి. ఫలితంగా దీర్ఘకాలం మన్నికగా ఉండాల్సిన రోడ్లు స్వల్ప వ్యవధిలోనే దెబ్బతింటున్నాయి.

బీటీ రోడ్లపైనే అధికం..

ఎక్కువగా బీటీ రోడ్లపై ట్రాక్టర్లను కేజీ వీల్స్(ఇనుప చక్రాల)తో నడపడంతో దెబ్బతింటున్నాయి. అవగాహన లేని కొందరు ట్రాక్టర్ల డ్రైవర్లు బీటీ రోడ్లపై కేజీ వీల్స్ బిగించి తిరగడంతో ఎక్కడికక్కడ బీటీ లేచిపోవడం, పగుళ్లు ఏర్పడడం, ఇతర కారణంగా దెబ్బతింటున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో పగుళ్లలో నీళ్లు నిల్చుని మరింతగా రోడ్లు గుంతలమయంగా తయారవుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ పనులు, వరినారు మళ్లు తయారు చేసే సమయంలో కేజీ వీల్స్ ఉన్న ట్రాక్టర్లను బీటీరోడ్లపై అటు ఇటుగా తిప్పడంతో దెబ్బతింటున్నాయి. వాస్తవంగా ట్రాక్టర్లు వ్యవసాయ పొలంలోకి వెళ్లిన తరువాత వీల్స్ మార్చుకుని పనులు ముగిసిన తర్వాత, తిరిగి మార్చుకుని రాకపోకలు సాగిస్తే రోడ్లకు ఎలాంటి నష్టం ఉండదు. చాలా మంది తమ ఇళ్ల వద్దనే ట్రాక్టర్లకు కేజీ వీల్స్ మార్చుకుని పంటపొలాలకు బీటీరోడ్లపై వెళ్లడంతో దారి పొడవున ఎక్కడికక్కడ రోడ్లు దెబ్బతింటున్నాయి. కొందరు రైతులు తమ ఇనుప వ్యవసాయ పనిముట్లు పదునుగా తయారయ్యేందుకు సైతం బీటీరోడ్లపై రాకుతూ ముందుకు తీసుకెళ్తున్నారు. రోడ్లను దెబ్బ తీస్తున్న వారిని గుర్తించి అప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. అంతేగాక గ్రామీణ ప్రాంతాలలో రైతులకు, ట్రాక్టర్ల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తే జాగ్రత్త పడే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్లు దెబ్బతింటున్నాయి..



బీటీ రోడ్లు ట్రాక్టర్ల కేజీ వీల్స్ కారణంగా దెబ్బతింటున్నాయి. ఎక్కడికక్కడ రోడ్లపై కోతలు, గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. మళ్లీ రోడ్డు మరమ్మతు చేయాలంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కేజీ వీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

– ప్రతాప్‌రెడ్డి, కొత్తూరు

రోడ్లను కాపాడుకోవాలి



ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన బీటీ రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది. రోడ్ల పైకి కేజీ వీల్స్‌తో వచ్చే ట్రాక్టర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసులను ఆదేశించాం. ప్రజలు రోడ్లను సంరక్షించుకునేందుకు కృషి చేయాలి. రూ.కోట్లు వెచ్చించి వేసిన బీటీ రోడ్లను ఇలా ఇష్టారాజ్యంగా పాడు చేయడం మంచిది కాదు.

– లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

పచ్చిరొట్టతో.. ప్రయోజనాలు



పొలాల్లో సాగు చేసిన జనుము



పొలంలో సాగు చేసిన జీలుగ

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: సాగు నేలల్లో పోషకాలు పెంచి ఆశించిన దిగుబడి సాధించడానికి రైతులు రసాయన ఎరువుల వినియోగిస్తారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకునేందుకు పచ్చిరొట్ట ఎరువు ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. గతంలో సాగు భూమి లో పశువుల ఎరువులు ఉపయోగించే వారు. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం అధికంగా ఉండటంతో నేలల్లో సూక్ష్మ పోషకాలు నశించి భూములు చౌడు బారి సత్తువ తగ్గిపోతుంది. ఈ ప్రభావం పంట దిగుబడిపై పడుతుంది. ఈ పరిస్థితులను అధిగమించడానికి పప్పుజాతికి చెందిన పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసంద, ఉలవ పైర్లను సాగు చేసి నిర్ణీత సమయంలో భూమిలో కలియ దున్నాలి. అందుకు సంబంధించిన వివరాలను ఏడీఏ రైతులకు వివరించారు.

ఉపయోగాలు.. లక్షణాలు

పచ్చిరొట్టతో నేల గుల్లబారి భూమికి నీటిని, పోషకాలను నిల్వ చేసుకునే శక్తినిస్తుంది. మొక్కల వేర్లకు గాలి, నీరు, పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు అందుతాయి.

- నేలలో చౌడు, కలుపు మొక్కల ఉధృతిని తగ్గిస్తాయి.
- నేల లోపలి పొరల్లోని పోషకాలు పైపొరల్లోకి వచ్చి పంట దిగుబడి పెరగడానికి దోహదపడతాయి.
- పంటకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు పెరుగుతాయి. వేరు వ్యవస్థ వృద్ధి చెందుతుంది.
- నేలకోతను అరికడుతుంది. ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పచ్చి రొట్టను కలియదున్నిన తర్వాత రెండు వారాల్లో వరినాట్లు వేస్తారు. అయితే తేలిక నేలల్లో మురుగునీరు ఎక్కువగా పారే భూముల్లో వారం రోజుల్లో నాట్లు వేసుకోవచ్చు. మురుగునీరు పోయే అవకాశం లేని భూముల్లో మూడు వారాలు నాట్లు వేయరాదు. ఎందుకంటే పచ్చిరొట్ట భూమిలో కుళ్లినప్పుడు తరయారయ్యే కొన్ని వాయువులు, ఆమ్లాలు అప్పుడే నాటిన వరి మొక్కకు హాని చేయవచ్చు.

- పచ్చిరొట్ట మొక్కల వేరు బూడిపెల్లో రైజోబియం పెరిగి ఎక్కువ నత్రజని స్థిరీకరిస్తుంది.

యాజమాన్య పద్ధతులు..

ఉదయజని ఎక్కువగా ఉన్న నేలల్లో పచ్చి రొట్ట పైరుగా జీలుగు మాత్రమే వేయాలి. జీలుగులో చౌడును హరించే శక్తి ఉంది. ఎర్రనేలల్లో తేలిక నేలల్లో జనుము, అలసంద, పెసర, నల్లరేగడి నేలల్లో జీలుగు, పిల్లి పెసర వేసుకోవచ్చు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే నీటి వసతిని పరిగణలోకి తీసుకుని పచ్చిరొట్ట పెంచడమే శ్రేయస్కరం. కాలువల ఆయకట్టులోని రైతులు నీటి విడదల కాగానే పచ్చి రొట్టని వేసి పెరిగిన తర్వాత భూమిలో కలియదున్నాలి. ఆరు తడి పంటలైన పత్తి, పసుపు, చెరుకు, తదితర దీర్ఘకాలిక పంటల్లో వరుసల మధ్యలో జనుము పచ్చిరొట్టగా వేసుకోవచ్చు. పచ్చిరొట్ట ఎరువులను విత్తే ముందు ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్పేట్ వేయాలి. దీంతో వృద్ధి ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువులను 40–45 రోజుల వయస్సులో బాగా కలియదున్నాలి. మొక్కలు కనీసం 15 నుంచి 22 సెంటీమీటర్ల లోతుగా వెళ్లేటట్లు చూడాలి.

పచ్చి రొట్ట పంట	ఎకరానికి విత్తనాలు	ఎకరానికి తయారయ్యే పచ్చి రొట్ట	లభించే నత్రజని (ఎకరానికి)	అనుకూలమైన నేలలు
జనుము	16 కిలోలు	10-15 టన్నులు	16-24 కిలోలు	ముంపు నేలలు
జీలుగ	12 కిలోలు	8-10 టన్నులు	30-40 కిలోలు	చౌడు నేలలు
పిల్లి పెసర	8 కిలోలు	4-5 టన్నులు	10-14 కిలోలు	నల్లరేగడి నేలలు
పెసర	14 కిలోలు	4-5 టన్నులు	10-14 కిలోలు	నల్లరేగడి నేలలు
అలసంద	16 కిలోలు	4-6 టన్నులు	16-20 కిలోలు	తేలిక నేలలు

ఉమామహేశ్వర లోయలోకి దూసుకెళ్లిన కారు

అచ్చంపేట: మండలంలోని రంగాపూర్ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని వెళ్తుండగా ఘాట్‌రోడ్డులో కారు న్యూట్రల్ చేయగా అదుపు తప్పి లోయలోకి పడిపోయింది. హైదరాబాద్‌కు చెందిన అకెల కృష్ణచైతన్య, స్వాతి, ఆంజనేయశర్మ, ఇద్దరు పిల్లలు శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉమామహేశ్వరం క్షేత్రం దర్శించుకుని వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న ఆలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వారిని బయటికి తీసుకువచ్చారు.



లోయలో పడి దెబ్బతిన్న కారు

భార్యాభర్తలను ఢీకొన్న వాహనం

భార్య మృతి, భర్తకు గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా.. భర్తకు గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ గోకారి, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. మండలంలోని కొండేరు చెందిన చాకలి బజారి, భార్య మహేశ్వరి(36) తో కలిసి ద్విచక్రవాహనంపై కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిపై జింకలపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ప్రమాదదవశాత్తు గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మహేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా బజారికి తీవ్ర గాయాలు కాగా.. కర్నూల్‌కు తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



మహేశ్వరి (ఫైల్)

కొడవలితో తమ్ముడిపై అన్న దాడి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ఉండవెల్లి: క్షణికావేశంలో తమ్ముడు, ఆయన భార్యపై సొంత అన్న దాడి చేసిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శేషన్న, కిష్టమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇందులో మొదటి వ్యక్తి వెంకటనర్సింహ, రెండో కుమారుడు రాముడు. వీరు మండల కేంద్రంలోనే నివాసం ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం వెంకటనర్సింహ కుమారుడిని బంధువులను క్యాతూరులో వదిలి రావాలని రాముడు చెప్పాడు. కాగా వారిని వదిలి తిరిగి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. తన కుమారుడు మృతికి తమ్ముడు రాముడు కారణమని అన్న వెంకటనర్సింహ తరుచూ గొడవలు పడేవారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మాటా మాటా పెరగడంతో కొడవలితో రాముడిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా ఆయన భార్య సుగుణమ్మ అడ్డుతగలడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తమ్ముడు రాముడు ఫిర్యాదు మేరకు అన్న వెంకటనర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

కారును ఢీకొట్టిన కర్ణాటక ఆర్టీసీ బస్సు

- మద్యం మత్తులో నడిపిన డ్రైవర్

మరికల్: కర్ణాటక ఆర్టీసీ బస్సు డ్రైవర్ మద్యం మత్తులో హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు బస్సును నడుపుకుంటూ వస్తు కారు ఢీకొట్టి వెళ్తుండగా మరికల్ పోలీసులకు చిక్కాడు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో రాయచూర్‌కు వస్తున్న కర్ణాటక బస్సు డ్రైవర్ మద్యం తాగి బస్సు నడిపించాడు. మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. బస్సును నిలపకుండా రావడంతో ఘటనను చూసిన ఇతర వాహనదారులు దేవరకద్ర, మరికల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాపు కాచిన మరికల్ పోలీసులు కర్ణాటక బస్సును పట్టుకుని ప్రయాణికులను ఇతర బస్సులో రాయచూర్‌కు పంపించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో కర్ణాటక బస్సు

గోవా నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

మహబూబ్‌నగర్ క్రైం: గోవా నుంచి హైదరాబాద్ వెళ్తున్న టూరిస్ట్ బస్సును ఆదివారం రూరల్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. బస్సులో ప్రయాణం చేస్తున్న శ్రావణ్‌కుమార్ డ్యూటీ పే చేయకుండా తరలిస్తున్న నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హార్వెస్టర్ దగ్ధం



వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో శనివారం రాత్రి విద్యుదాఘాతంతో హార్వెస్టర్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు మోహన్‌గౌడ్ పొలంలో ఉదయం హార్వెస్టర్‌తో పనిచేసి రాత్రి పొలంలో ఉంచి ఇంటి వచ్చినట్లు యజమాని శ్రీకాంత్ తెలిపారు. హార్వెస్టర్‌లోని ప్రధాన భాగమైన ట్రక్ సైడ్ జరిగిందని దాన్ని మరుసటి రోజు సరిచేయాలనే ఉద్దేశంతో పొలంలోనే ఉంచామని, రాత్రి వేళ బ్యాటరీలో మంటలు ఎగిసిపడి హార్వెస్టర్ కాలిపోయిందని, దీంతో రూ.30 లక్షల నష్టం వాట్లినట్లు వాపోయాడు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,006 క్యూసెక్కుల నీరు వచ్చింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, 7.875 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 155 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రామన్‌పాడులో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటిని నిలిపారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ఆయిల్‌పాం వైపు అడుగులు

రెండేళ్లుగా మామిడి సాగుపై ఆసక్తి చూపని రైతులు

- సాగు శాతం క్రమంగా తగ్గుతున్న వైనం
- దిగుబడులు తగ్గడం, ధరలు లేకపోవడమే కారణం
- క్రమంగా పెరుగుతున్న తోటలు
- వేలాది ఎకరాల్లో సాగు కోసం రైతుల దరఖాస్తులు



మామిడి తోటలు

కొల్లాపూర్: మామిడి సాగుపై జిల్లా రైతుల్లో ఆసక్తి తగ్గుతోంది. మామిడికి పేరెన్నిక గాంచిన కొల్లాపూర్ వంటి ప్రాంతాల్లో కూడా క్రమంగా మామిడి సాగుకు రైతులు దూరమవుతున్నారు. ఉద్యాన శాఖ రికార్డులు పరిశీలిస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతోంది. మామిడి సాగును తగ్గించి రైతులు ఆయిల్‌పాంపై దృష్టి సారిస్తున్నారు. గత కొన్నేళ్లుగా మామిడి తోటల్లో ఆశించిన దిగుబడులు రాకపోవడం, పండిన పంటకు సరైన మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారు. దీంతో పెద్ద వ యస్సు ఉన్న మామిడి చెట్లను తొలగించి, ఇతర పంటలు సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఏటేటా తగ్గుతున్న మామిడి తోటలు

జిల్లాలో 34,712 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో అధికశాతం కొల్లాపూర్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. గడచిన మూడేళ్లలో ఉద్యాన శాఖ అధికారుల లెక్కల ప్రకారం సాగు విస్తీర్ణం ఆశించిన రీతిలో పెరగకపోగా కొన్ని చోట్ల తగ్గుతూ వస్తోంది. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం వందల ఎకరాల్లో మామిడి తోటలను తొలగిస్తున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో కూడా 300 ఎకరాలకు పైగా తోటలను తొలగించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో స్వల్ప మొత్తంలో మామిడి సాగు పెరిగింది. 2019లో 2,325 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా 2022 ఏడాది ముగిసే నాటికి 2,510 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. నియోజకవర్గ పరిధిలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కోడేరు మండలాల్లో 2019లో 14,565 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, 2020లో 15,967 ఎకరాలకు, 2021లో 22,388, 2022లో 25,236 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. 2019 నుంచి 2020 నాటికి 1,402 ఎకరాలు, 2021లో 6,421, 2022లో ఆశించిన స్థాయికంటే తక్కువగా 2,848 ఎకరాలు మాత్రమే పెరిగింది. ఇక 2023లో ఈ సంఖ్య గణనీయంగా తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తుల వెల్లువ

మామిడి సాగుపై విముఖత చూపుతున్న రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టిపెడుతున్నారు. మామిడి సాగుకోసం పొలాలను గతంలోనే సిద్ధం చేసుకున్న వారు కూడా ఇటీవల కాలంలో మామిడి రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను చూసి ఆలోచన మార్చుకుంటున్నారు. ఆయిల్‌పాం తోటల సాగు కోసం ఉద్యాన శాఖకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. 2021లో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 300 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేపట్టారు. 2022 పూర్తయ్యే సరికి జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం 3,057 ఎకరాలకు చేరుకోవడమే ఇందుకు నిదర్శనం.

జిల్లా వివరాలిలా..

మామిడి సాగు (ఎకరాల్లో)

నియోజకవర్గం	2019	2020	2021	2022
కల్వకుర్తి	6,265	5,196	5,061	4,547
అచ్చంపేట	2,776	2,626	2,347	2,418
కొల్లాపూర్	14,565	15,967	22,388	25,236
నాగర్‌కర్నూల్	2,325	2,221	2,409	2,410



సాగు వివరాలిలా..

2021లో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు	2022లో
300 ఎకరాలు	3,057 ఎకరాలు

2023లో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న భూమి విస్తీర్ణం : 2,300 ఎకరాలు

కొన్నేళ్లుగా మామిడి రైతుకు నష్టాలు



10 ఎకరాల్లో మామిడి తోట ఉంది. ఈ ఏడాది తోట సాగు కోసం రూ.4 లక్షల మేరకు ఖర్చు చేశాం. పంట అమ్మితే వచ్చింది రూ.60వేలు మాత్రమే. తెగుళ్ల కారణంగా పంట దిగుబడి రాలేదు. ఉన్న అరకొర పంటకు మద్దతు ధర లేదు. మామిడి రైతులు అందరి పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అందుకే మా ఊర్లో చాలామంది రైతులు మామిడికి బదులుగా ఆయిల్‌పామ్ సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. మొక్కల కోసం ఉద్యాన శాఖ కు దరఖాస్తులు చేస్తున్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గుండ్రాతి శంకర్‌గౌడ్, రైతు, ఎన్మన్‌బెట్ల

ఈ ప్రాంతంలో డిమాండ్ పెరిగింది



మామిడి తోటల సాగులో రైతులకు కొన్నేళ్లుగా నష్టాలు వస్తున్నాయి. కొత్తగా మామిడి చెట్లు నాటే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. మామిడి స్థానంలో ఆయిల్‌పామ్ మొక్కలు పెంచేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యానశాఖ లక్ష్యం కంటే అధికంగా రైతుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో రైతులకు సీరియల్ ప్రకారం మొక్కలు అందిస్తున్నాం. కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో గతేడాది 792 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈసారి ఆ సంఖ్య బాగా పెరగనుంది.

– లక్ష్మణ్, ఉద్యానశాఖ అధికారి, కొల్లాపూర్

నష్టాలు రావడమే కారణం..

మామిడితోటలకు గత కొన్నేళ్లుగా తెగుళ్ల బెడద అధికమైంది. తేనెమంచు పురుగు, నల్లి కారణంగా పూత, పిందెలు రాలిపోతున్నాయి. అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో పంట చేతికిరావడం కష్టతరంగా మారింది. కాయ పక్వానికి వచ్చినప్పుడు పండు ఈగలు ఆశిస్తుండడంతో పండ్లలో పురుగులు వస్తున్నాయి. దీంతో పండ్లను విదేశాలకు ఎగుమతులు చేయడం సాధ్యం కావడం లేదు. మంగు, బంక వంటి కారణాలు చూపి వ్యాపారులు మామిడి కాయలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి తక్కువగా ఉన్నప్పుడు కూడా మద్దతు ధరలు లభించక పోవడంతో రైతులు మామిడితోటల సాగు పట్ల అనాసక్తి కనబరుస్తున్నారు.

కౌలు రైతుల పరిస్థితి అధ్వానం

జిల్లాలో తోటలను కౌలుకు తీసుకుంటున్న రైతులకు కొన్నేళ్లుగా తీవ్రమైన నష్టాలు చవిచూస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి తోటలును కౌలు ప్రాతిపదికన రైతులు సాగుచేస్తుంటారు. వారికి గత ఐదేళ్లుగా పురుగు మందులకు ఖర్చు చేసిన డబ్బులు కూడా రానటువంటి దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మామిడి తోటలను కౌలుకు తీసుకునేందుకు పెద్దగా కౌలుదారులు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది చాలామంది కాపు కాసిన తర్వాతనే తోటలను కౌలుకు తీసుకున్నారు. అయినా కూడా ధరలు అకస్మాత్తుగా పడిపోవడంతో మళ్లీ నష్టాలనే మూట గట్టుకున్నారు.

పాలనలో నయా పంథా

సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు

- పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలు
- దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ
- వాటిలో కొత్తగా 1.34 శాశ్వత ఉద్యోగాల భర్తీ
- ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవా వ్యవస్థ
- నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ



సాక్షి, అమరావతి: కేవలం నాలుగేళ్లలోనే సంస్కరణల ద్వారా పరిపాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రం చిరునామాగా మారింది. సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో అందించాల్సిన సేవల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు, సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాలనా వ్యవస్థల్లో మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకే అధికారాలు, విధులు అప్పగించాలనే మాటలను సాక్షాత్కరింప చేసిన ఏకైక రాష్ట్రంగా నిలిచింది ఏపీనే. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి.. పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను అందిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే (2019) కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకోకుండా.. ఆ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఉద్యోగులు, సిబ్బందిని భర్తీ చేసింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలతో పక్కా వ్యవస్థ ఏర్పాటు చేసింది. వీటిలో 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాలను కొత్తగా సృష్టించి.. భర్తీ చేసింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున ప్రజల చేయి పట్టుకుని నడిపించే సేవా వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలతో అనుసంధానమై 2.65 లక్షల మంది వలంటీర్లుగా గ్రామాల్లో పని చేస్తున్నారు. తద్వారా 600 పౌర సేవలు ఎటువంటి లంచాలు, వివక్షకు తావు లేకుండా అందుతున్నాయి. మారుమూల పల్లెల్లో సైతం ఎక్కడ చూసినా పౌర సేవల్లో గొప్ప విప్లవం కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు

ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయి. దీంతో గతంలో ఎక్కడకో వెళ్లి దరఖాస్తు చేయడం, రాజకీయ నేతల చుట్టూ తిరగడం, లంచాలు ఇవ్వడం.. ఇలాంటి కష్టాలన్నింటికీ బ్రేక్ పడింది. ఉన్న ఊరిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉంటే చాలు.. ఎవరి సిఫార్సు లేకుండానే సేవలు, పథకాలు అందుతున్నాయి. గతంలో రూపాయి ఇస్తే పావలా మాత్రమే లబ్ధిదారులకు చేరేది. ఇప్పుడు నేరుగా నగదు బదిలీ ద్వారా రూపాయి ఇస్తే రూపాయి లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్లోంది. గత నాలుగేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ అయింది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్, ఇంటి జాగా ఇలా ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా.. లేదా ఏ ప్రభుత్వ సేవలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందుతున్నాయి. గతానికి, ఇప్పటికీ ఇదో గొప్ప మార్పు.

రేషన్ డోర్ డెలివరీతో రోల్ మోడల్

పేదల ఇంటి వద్దకే రేషన్ డోర్ డెలివరీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్‌గా నిలిచింది. ఏ పల్లెలో అయినా, పట్టణంలో అయినా రేషన్ బియ్యం మన వీధికి, మన ఇంటి ముంగిటకే అందించే వ్యవస్థ దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉంది. మిగతా రాష్ట్రాలు ఈ వ్యవస్థను అమలు చేసేందుకు యత్నిస్తున్నాయి. రేషన్ షాపుల దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడే దుస్థితిని నివారించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 9,260 డెలివరీ వ్యాన్‌లతో నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని నెలనెలా డెలివరీ చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏపీ ఒక్కటే.

అవ్వాతాతల ఇంటికే ప్రతి నెలా పెన్షన్

దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘ వ్యాధిగ్రస్తుల ఇంటికే ప్రతి నెలా పెన్షన్‌ను వలంటీర్ల ద్వారా అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వలంటీర్ ఇంటింటికీ వచ్చి లబ్ధిదారుల చేతిలో పెన్షన్ సొమ్ము పెట్టే కార్యక్రమం సజావుగా సాగుతోంది. అర్హులైన పేదలకు పెన్షన్ మంజూరు, పంపిణీలో వచ్చిన మరో గొప్ప మార్పు ఇది.

వ్యవసాయం పండుగైంది

దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ కేంద్రాలు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా ఉంటూ, వారి చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ఆర్బీకేలలో 10,778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు పని చేస్తూ రైతులకు తోడుగా ఉన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్యానికి భరోసా

రాష్ట్రంలో 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా చికిత్సలను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఈ రంగంలో గొప్ప మార్పులను తీసుకొచ్చింది. ఈ క్లినిక్స్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉంటారు. 105 రకాల మందులు ఉంటున్నాయి. 14 రకాల పరీక్షలు చేస్తూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానమై అక్కడే సేవలందిస్తూ కనిపిస్తున్నారు. గతానికి ఇప్పటికి వ్యవస్థలో ఇదో స్పష్టమైన మార్పు.

కొత్తగా మరో 13 జిల్లాలు

రాష్ట్రంలో 2019 నాటికి 13 జిల్లాలు ఉంటే జిల్లా పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం కొత్తగా 13 జిల్లాల ఏర్పాటు ద్వారా మొత్తం 26 జిల్లాలను చేసింది. 51 డివిజన్లను 78కి, 679 మండలాలను 691కి పెంపు ద్వారా మరింతగా పాలనను వికేంద్రీకరణ చేసింది. ఆఖరికి చంద్రబాబు నియోజకవర్గం కేంద్రమైన కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా చేసింది ప్రస్తుత ప్రభుత్వమే. ప్రజలకు జిల్లా, డివిజన్, మండల పాలన సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా వికేంద్రీకరణ చేపట్టింది. ఇది పరిపాలన రంగంలో గొప్ప సంస్కరణగా నిలుస్తోంది.

సమగ్ర భూ సర్వేతో వివాదాలకు స్వస్తి

భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టి గ్రామ స్థాయిలో గొప్ప మార్పునకు నాంది పలికింది. సమగ్ర భూ సర్వే కోసం గ్రామాలు, పట్టణాల్లో ఏకంగా 10,185 మంది సర్వేయర్లను నియమించింది. 40 డ్రోన్లు కొనుగోలు చేసింది. కబ్జాలకు, భూ వివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతూ.. ప్రజల భూములపై శాశ్వత భూ హక్కును కల్పిస్తూ స్పష్టమైన భూ రికార్డులకు ప్రభుత్వం నాంది పలికింది.

టెండర్ల విధానంలో పారదర్శకత

జ్యుడీషియల్ ప్రివ్యూతో పాటు రివర్స్ టెండర్ ద్వారా టెండర్ల విధానంలో పారదర్శకతకు పెద్ద పీట వేసింది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తొలిసారి జ్యుడీషియల్ ప్రివ్యూను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఏపీ మౌలిక సదుపాయాలు (తొలుత న్యాయ పరమైన సమీక్ష ద్వారా పారదర్శకత) చట్టం-2019ను అమల్లోకి తెచ్చింది. రూ.100 కోట్లు పైబడిన పనుల టెండర్లన్నీ జ్యుడిషియల్ ప్రివ్యూకు వెళ్తున్నాయి. రివర్స్ టెండర్ ద్వారా ప్రజా ధనం ఆదాకు పెద్దపీట వేస్తూ తెచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి.

'స్పందన'తో ప్రజా సమస్యల పరిష్కారం

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో సంబంధిత ఉన్నతాధికారులు స్వయంగా నిర్వహిస్తున్నారు. 1902కు ఫోన్ చేసి సమస్యను చెబితే.. దాన్ని నమోదు చేసుకుని నిర్ణీత సమయంలోగా పరిష్కరించే ఏర్పాటు చేశారు. దీన్ని మరింత నాణ్యతతో అమలు చేయడంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమంగా మార్చారు. ఇది ప్రజల సమస్యల పరిష్కారానికి వ్యవస్థలో తీసుకువచ్చిన గొప్ప మార్పుగా నిలుస్తోంది.

మహిళా సాధికారత దిశగా అడుగులు

మహిళలకు ప్రభుత్వ నామినేట్ పనులు, నామినేట్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టాలు చేసి, అమలు చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళల కోసం ఇలాంటి చట్టాలు చేసిన దాఖలాల్లేవు. జెండర్ బేస్ట్ బడ్జెట్ పేరుతో మహిళలకు, పిల్లలకు బడ్జెట్ ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిట ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే. మహిళా సాధికారత దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో స్థాపించే పరిశ్రమలు, కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 75 శాతం ఇవ్వాలని ప్రత్యేకంగా చట్టం చేసి, అమలు చేస్తోంది. స్థానికంగా యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాలను ప్రోత్సహిస్తోంది.

మారిన విద్య, వైద్య రంగాలు

ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన కనీస సామాజిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. ఈ రెండు రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ మార్పులకు శ్రీకారం చుట్టడంతో ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్య సంస్థలను వేగంగా బలోపేతం చేస్తున్నారు. మారుతున్న సాంకేతికతతో పాటు భవిష్యత్‌లో అవసరమైన రంగాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు బోధనా పద్ధతుల్లో, పాఠ్యాంశాల్లో మార్పులు తెచ్చారు. నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడానికి బాటలు వేశారు. వైద్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తెచ్చారు. రెండేళ్లలోనే 48,639 మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం ద్వారా అన్ని స్థాయి వైద్య సంస్థల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు.

నాడు ఎన్టీఆర్‌ను తిట్టారు.. నేడు దండలు వేస్తున్నారు

చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై ఆర్జీవీ, పోసాని, లక్ష్మీపార్వతి ఆగ్రహం

- రాజమండ్రిలో జరుగుతున్నది పెద్ద జోక్
- ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది
- చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విమర్శ
- వైఎస్సార్‌సీపీని మళ్లీ మళ్లీ గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి
- విజయవాడలో ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'నేను ఒక సీరియస్ జోక్ చెప్పడానికే ఇక్కడికి వచ్చాను. ఆ జోక్ ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతోంది. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది. ఆయన మరణానికి కారణమైన వాళ్లే.. ఇప్పుడు ఎన్టీఆర్ కంటే గొప్ప వ్యక్తి లేరు అంటూ కీర్తిస్తున్నారు' అని టీడీపీ మహానాడును ఉద్దేశించి సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. నాడు లక్ష్మీపార్వతితో ఉన్న ఎన్టీఆర్‌ను తిట్టిన వాళ్లే.. నేడు ఆయనకు ఎందుకు దండలు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు ఎన్టీఆర్ లలిత కళా అవార్డును పోసాని కృష్ణమురళికి ప్రదానం చేశారు. అనంతరం రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎలాంటి వ్యక్తి అనేది స్వయంగా ఎన్టీఆరే చెప్పారన్నారు. రజనీకాంత్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి వచ్చి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వాళ్లతో కూర్చున్నారంటే.. ఒకరకంగా ఆయన కూడా ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడుస్తున్నట్లేనన్నారు. నందమూరి కుటుంబంలో ఉన్న ఒకే ఒక్క మగాడు జూనియర్ ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. తాతకు వెన్నుపోటు పొడిచిన వారితో వేదిక పంచుకోవడం ఇష్టం లేకే.. ఆయన వీళ్లందరికీ దూరంగా ఉంటున్నారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. తాను 'వ్యూహం' సినిమా తీస్తున్నానని, అందులో చంద్రబాబు క్యారెక్టర్‌ను అరటిపండులా వలిచి చూపిస్తానని ప్రకటించారు.

లక్ష్మీపార్వతిపై బాబు వదంతులు

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ.. ఏ కులం, ఏ మతం వారితో అయినా స్నేహం చేయవచ్చు కానీ.. గుణం లేని వారితో మాత్రం చేయకూడదన్నారు. గుణం లేని వాడు చంద్రబాబు అని.. అతనికి దూరంగా ఉండటం చాలా మంచిదని సూచించారు. తన మంచిచెడులు చూసుకునేందుకు లక్ష్మీపార్వతిని ఎన్టీఆర్ ఆహ్వానించారని, కానీ ఆమెపైనా చంద్రబాబు అనేక పుకార్లు పుట్టించారని చెప్పారు. చంద్రబాబు వల్ల ఎన్టీఆర్‌కు మూడుసార్లు గుండెపోటు వచ్చినా.. లక్ష్మీపార్వతి ఒక్కరే అండగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు.



పోసానికి ఎన్టీఆర్ లలిత కళా పురస్కారం అందజేస్తున్న లక్ష్మీపార్వతి, రామ్‌గోపాల్‌వర్మ తదితరులు

బాబు కుట్రలకు ఎన్టీఆర్ కుమిలిపోయారు

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అడ్డదారుల్లో అధికారాన్ని లాక్కునేందుకు చంద్రబాబు చేసిన కుట్రలపై ఎన్టీఆర్ ఎంతగానో కుమిలిపోయారని చెప్పారు. ఎన్టీఆర్‌ను అడుగడుగునా వేధింపులకు గురిచేశారన్నారు. ఎన్టీఆర్ కష్టకాలంలో దేవినేని నెహ్రూ అన్నీ తానై నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన గౌరవాన్ని నిలబెట్టిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి మరణించే వరకు ప్రతి ఘటననూ తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఎన్టీఆర్ లాంటి గొప్ప మనిషి కూడా చంద్రబాబు కుట్రకు బలయ్యారన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్, వైఎస్సార్ ఒక కులానికో, పార్టీకో పరిమితం కాదన్నారు. వారు మహనీయులని.. తెలుగు జాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. సభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో క్రీడాకారుడి ప్రతిభ

- మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



చంద్రశేఖర్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ చిక్కడ్‌పల్లిలోని ఇండియా పోస్ట్ కన్వెన్షన్ సెంటర్‌లో శని, ఆదివారాల్లో 2వ నేషనల్ మాస్టర్స్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారుడు ఎస్. చంద్రశేఖర్‌గౌడ్ ప్రతిభ చాటారు. 55–60 ఏళ్ల విభాగం 55కేజీల కేటగిరిలో చంద్రశేఖర్‌గౌడ్ బంగారు పతకం సాధించారు. ఈయన ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. చంద్రశేఖర్‌గౌడ్ గతంలో పలు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2010 చెన్నైలో ఆలిండియా సివిల్ సర్వీసస్, 2014 ఢిల్లీలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాలు సాధించారు.

పాఠశాలల నిధుల మళ్లింపు సరికాదు



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఉర్దూ మీడియం పాఠశాలలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం సరికాదని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ నుంచి ఉర్దూ మీడియం పాఠశాలల సమగ్ర అభివృద్ధికి పాఠశాలకు రూ.50వేల చొప్పున ఉర్దూ అకాడమీ ద్వారా కేటాయించడం జరిగిందని, కానీ, ఈ డబ్బులను ఎస్ఎంసీలకు సమాచారం లేకుండా సర్వశిక్షా అభియాన్ ఖాతాకు మళ్లించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠశాలలను అభివృద్ధి పరుస్తామంటూనే.. మరోవైపు కేటాయించిన నిధులను వేరే శాఖకు మళ్లించుకోవడం ద్వారా పాఠశాలల అభివృద్ధి కుంటుపడుతుందనే అంశాన్ని గుర్తించకపోవడం దారుణమన్నారు. సమైక్య రాష్ట్రంలో ఎన్నడూ ఇలా జరగలేదని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఉర్దూ మీడియం పాఠశాలలకు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి సయ్యద్ ఖాజా జైనుల్లా అబెదిన్, కార్యదర్శి ఎండీ సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం.. మరింత చేరువ



అచ్చంపేటలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంద పడకల ఆస్పత్రి

- అచ్చంపేటలో అధునాత సౌకర్యాలతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం
- 30న మంత్రి హరీశ్‌రావు ప్రారంభం
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కల నెరవేరబోతుంది. అన్ని హంగులతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యింది. ఈనెల 30న మంగళవారం 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించేందుకు ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అచ్చంపేటకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చురుకుగా పనులను పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారుల ఆదేశంతో ఆసుపత్రిని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరిశీలించారు. అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై నిర్లక్ష్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు.

2016లో శంకుస్థాపన

వైద్యం కోసం అచ్చంపేట ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సీఎం కేసీఆర్‌తో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి 100 పడకల ఆస్పత్రి కోసం 2016లో శంకుస్థాపన చేశారు. రూ. 20కోట్ల వ్యయంతో ఆస్పత్రి నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రి నిర్మాణం ఆలస్యమైంది. ఇన్నేళ్లకు భవనం పూర్తి కావడం.. ప్రారంభోత్సవానికి సిద్ధం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా గ్రామాలకు మేలు

నియోజకవర్గ కేంద్రమైన అచ్చంపేటలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రితో చాలా గ్రామాలకు మేలు జరగనుంది. ముఖ్యంగా అమ్రాబాద్, పదర, లింగాల, బల్మూర్, ఉప్పునుంతల, అచ్చంపేట మండలాలకు చెందిన పేద ప్రజలకు ఖరీదైన వైద్యం అందనుంది. ఇప్పటికే అధునాతన హంగులు, సౌకర్యాలు, వసతులతో ఆసుపత్రిని నిర్మించారు. ఆస్పత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా పూర్తయ్యింది.

తీరనున్న వైద్య సమస్యలు

మారుమూల ప్రాంతమైన నల్లమలలో వైద్య పరంగా వెనకబడి ఉంది. నల్లమల ప్రాంతంలోని చెంచుపెంటల ప్రజలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకోలేక చాలా మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అలాగే శ్రీశైలం– హైదరాబాద్ నేషనల్ హైవే 765పై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. మెరుగైన వైద్య సేవలు ఈ ప్రాంతంలో లేక ఎన్నో ఏళ్లుగా ప్రమాదాలకు గురైన వారు హైదరాబాద్ ప్రాంతానికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు వదిలారు. ఆస్పత్రి అందుబాటులోకి వస్తే వైద్య సమస్యలు తీరుతాయి.

ప్రజల చిరకాల కోరిక తీరనుంది



నల్లమల ప్రాంతంలో ప్రజలు వైద్య సేవలు అందక ఇన్నాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి 100 పడకల ఆస్పత్రి మంజూరు చేశారు. ఆస్పత్రి ప్రారంభం ఆలస్యం కావడానికి కారణాలు ఉన్నా ఈనెల 30న మంత్రి హరీశ్‌రావుచే ప్రారంభించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తాం. అచ్చంపేట ప్రజల చిరకాల కోరిక, తన కల సాకారం అవుతున్నాయి.

– గువ్వల బాలరాజు, ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే

'ఆలయ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు'

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ ఆలయ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లోపించిందని యువభారత్ ఎన్‌సీపీ అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన అలంపూర్ పుణ్యక్షేత్రాన్ని దర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శక్తిపీఠాన్ని శతాబ్దాల చరిత్ర కలిగిన నవబ్రహ్మ ఆలయాలను పట్టించుకోవడం లేదన్నారు. తాను నవబ్రహ్మ ఆలయాలన్నింటిని సందర్శించానని అక్కడి దేవతామూర్తుల విగ్రహాలనను, ఆలయాల దీనావస్థను గమనించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. ఆలయ పాలక మండలి ఆలయ అభివృద్ధి విషయంలో నిష్పక్షపాతంగా పని చేయాలని కోరారు. అనంతరం ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ ఆయనను శేషవస్త్రాలతో సత్కరించి దేవస్థానం ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రాము, అభిలాష్, రితీష్ పాల్గొన్నారు



ఆలయంలో పూజలు చేస్తున్న వైద్య ప్రవీణ్‌కుమార్

టీ-20లో పాలమూరు జట్టు విజయం



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా క్రికెట్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: ముంబాయిలో జరిగిన టీ–20 క్రికెట్ మ్యాచుల్లో ఎండీసీఏ జిల్లా జట్టు మెరుగైన ప్రతిభకనబరిచింది. మూడు మ్యాచుల్లో జిల్లా జట్టు రెండు మ్యాచ్‌లను గెలుపొంది ట్రోఫీని అందుకుంది. ఆదివారం ముంబాయి కలినాలో జరిగిన టీ–20 మ్యాచ్‌లో జిల్లా జట్టు 97 పరుగుల తేడాతో కోటక్ మహీంద్ర స్పోర్ట్స్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. జట్టులో గణేష్ మెరుగైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 60 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోటక్ మహీంద్ర స్పోర్ట్స్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 13.2 ఓవర్లలో 73 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ మహ్మద్ ఖయ్యూం అద్భుతమైన బౌలింగ్ చేశాడు. 4 ఓవర్లు వేసి కేవలం 9 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. డేవిడ్ క్రిపాల్ 3, పవన్‌కుమార్, ఆబిద్ చెరో వికెట్ తీశారు. జిల్లా జట్టుకు కోటక్ మహీంద్ర జనరల్ మేనేజర్ సుధాకర్ ట్రోఫీ అందజేశారు.

ఎండీసీఏ అభినందనలు..

జిల్లా జట్టు గెలుపొందడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఇతర సభ్యులు అభినందించారు. ముంబాయిలో జరిగిన టీ–20 మ్యాచుల్లో జిల్లా జట్టు ప్రతిభచాటడం సంతోషంగా ఉందన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

- ఆడబిడ్డకు పురుడు పోసిన సిబ్బంది

కోస్గి: పురిటినొప్పులు రావడంతో స్వగ్రామం నుంచి అంబులెన్స్‌లో బయలుదేరిన గర్భిణి మధ్యలోనే ప్రసవమైన సంఘటన మండలంలోని ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు మండలంలోని పీసీతండాకు చెందిన గర్భిణి సుశీలకు ఆదివారం పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వాహనంలో కోస్గి ప్రభుత్వాస్పత్రికి బయలు దేరారు. కోస్గి శివారులోకి రాగానే నొప్పులు ఎక్కువ రావడంతో ఈఎంటీ అబ్దుల్ అసద్, పైలెట్ ఫయాజ్ వాహనంలోనే కాన్పు చేశారు. సుశీల ఆడశిశువుకు జన్మనిచ్చింది. కాన్పు అనంతరం తల్లీబిడ్డలను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



108 వాహనంలో కాన్పు చేసిన సిబ్బంది

రోడ్డు విస్తరణలో రాజకీయ రగడ

- వనపర్తిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

వనపర్తి: జిల్లాకేంద్రంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు రాజకీయ రగడకు దారితీశాయి. శనివారం అర్ధరాత్రి రెండు ప్రార్థనా మందిరాల ఆర్చ్ తొలగింపును నిరసిస్తూ ఆదివారం జిల్లాకేంద్రంలోని పాత బజార్ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి చిన్నారెడ్డి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్, మహబూబ్‌నగర్ లాంటి ప్రధాన పట్టణాల్లోనూ సామరస్యంగా విస్తరణ చేపట్టారు కానీ, వనపర్తిలో కొత్త నిబంధనలు అమలు చేస్తూ.. అర్ధరాత్రి దొంగల మాదిరిగా విగ్రహాలు, ప్రార్థనా మందిరాలను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు చిన్నారెడ్డితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరుపక్షాల నాయకులు మధ్య సుమారు రెండుగంటలపాటు రోడ్డుపై గందరగోళం, మాటల యుద్ధం కొనసాగింది. పలుమార్లు అధికారంలో ఉండి కూడా రోడ్ల విస్తరణ చేపట్టకుండా అమాయక ప్రజల చావుకు కారణమయ్యావంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ చిన్నారెడ్డిపై ఆరోపణలు గుప్పించారు. సమాచారం అందుకున్న సీఐ మహేశ్వర్ రావు, ఎస్ఐ యుగంధర్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఇరుపక్షాలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండేది ఇంకా నాలుగు నెలలు మాత్రమే.. మీరు ఏకపక్షంగా వ్యవహరించొద్దంటూ.. పోలీసులనుద్దేశించి మాజీ మంత్రి హెచ్చరించారు. ఇరుపక్షాల నాయకులు రాజకీయ దూషణలు చేసుకుంటూ.. రోడ్ల విస్తరణ అంశాన్ని రాజకీయం చేస్తూ.. వాదనలు చేసుకోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.



వాగ్వాదం చేసుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు